యూరియా.. ఏదయా ?

- ముప్పాళ్ల మండలంలో తీవ్రంగా యూరియా కొరత
- ఎరువుల దుకాణాల్లోనూ అందని వైనం
- ఉన్న చోట అధిక ధరలకు అమ్మకాలు
- తీవ్ర ఇబ్బందులు పడుతున్న రైతులు


ముప్పాళ్ల జీడీసీసీ గోదాము వద్ద పడిగాపులు కాస్తున్న రైతులు

ముప్పాళ్ళ: ఖరీఫ్ సీజన్ ఆరంభంలోనే రైతులకు కష్టాలు మొదలయ్యాయి. యూరియా లోడు వచ్చిందని తెలియగానే పెద్ద ఎత్తున రైతులు గోదాముల వద్దకు చేరుకుంటున్నారు. ముందు వచ్చిన వారికే అవి సరిపోతుండటంతో రైతులు నిరాశగా వెనుతిరగాల్సిన దుస్థితి. అధిక ధరలు వెచ్చించి కొనుగోలు చేద్దామన్నా దొరకని పరిస్థితి.

యూరియా బస్తా రూ.400

మండలంలో ముప్పాళ్ల, దమ్మాలపాడు మినహా ఎక్కడా ప్రభుత్వానికి సంబంధించిన ఎరువుల విక్రయ కేంద్రాలు లేవు. ఆ కేంద్రాలకు అరకొరగా సరఫరా కావటంతో పాటు, వచ్చిన ఎరువులు కూడా గోదాముల ఇన్‌చార్జ్‌లు టీడీపీ నేతలు సిఫార్సులు చేసిన వారికే అమ్ముతున్నారు. ఆ మేర వారు గృహాల్లో పెద్ద ఎత్తున నిల్వలు చేసుకున్నారు. యూరియా బస్తా ధర రూ.267 ఉండగా, బహిరంగ మార్కెట్‌లో రూ.350 నుంచి రూ.400 వరకు విక్రయిస్తున్నారు. అవి కూడా పెద్ద ఎత్తున టీడీపీ నేతల రికమండేషన్ ఉన్నవారికి మాత్రమే విక్రయిస్తున్నారు. అది కూడా కాంప్లెక్స్ మందు కట్టలు కొనుగోలు చేస్తేనే అనే నిబంధన పెట్టి మరీ సొమ్ము చేసుకుంటున్నారు.


గోదాము వద్ద రైతులతో మాట్లాడుతున్న ఏఓ శ్రీధర్‌రెడ్డి, ఎస్‌ఐ సోమేశ్వరరావు

స్వల్పంగా రాక.. తోపులాట

మండల కేంద్రమైన ముప్పాళ్లలోని జీడీసీఎంఎస్‌ఎల్ కేంద్రానికి శనివారం 20 టన్నుల యూరియా వచ్చిందని తెలియగానే పలు గ్రామాల రైతులు పెద్దఎత్తున తరలివచ్చారు. కార్యాలయం తెరవగానే అందరూ ఒక్కసారి చుట్టుముట్టారు. కొద్దిసేపు ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. అందరికీ అందిస్తామని చెప్పినప్పటికీ పట్టించుకోకపోవటంతో తోపులాట నెలకొంది. సమాచారం అందుకున్న ఎస్‌ఐ వి.సోమేశ్వరరావు, మండల వ్యవసాయాధికారి ఎస్.శ్రీధర్‌రెడ్డిలు కేంద్రం వద్దకు వచ్చి ఒక్కొక్కరికీ రెండు కట్టలు చొప్పున పంపిణీ చేశారు. నరసరావుపేట – సత్తెనపల్లి ప్రధాన రహదారి కావటంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది.



సిఫారసు ఉంటేనే..

ఉదయం నుంచి ఉంటే రెండు కట్టలే ఇస్తున్నారు. అదేమంటే అందరికీ ఇవ్వాలి కదా అని చెబుతున్నారు. సిఫార్సులు చేసిన వారికి మాత్రం ఎక్కువే ఇస్తున్నారు. అది కూడా ముందు వచ్చిన వారికే అందుతున్నాయి. వేరే ప్రాంతాలకు చెందిన వారికి కూడా ఇస్తున్నారు.

– దొడ్డా సీతారామిరెడ్డి, ముప్పాళ్ళ



అదునుకు ఎరువులు అందించాలి

పంట అదును అవసరమైన అన్ని రకాల ఎరువులు ప్రభుత్వమే సరఫరా చేయాలి. యూరియా కొరత రైతాంగాన్ని తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తుంది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మాదిరిగానే గ్రామంలోనే రైతులకు అవసరమైన ఎరువులు అందించాలి.

– కళ్లం శివరామిరెడ్డి, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్, దమ్మాలపాడు

హెచ్ఐవీపై అవగాహన అవసరం



నకరికల్లు: హెచ్ఐవీ-ఎయిడ్స్‌పై విద్యార్థులకు అవగాహన అవసరమని చైల్డ్‌ఫండ్ ఇండియా లింక్‌వర్కర్ స్కీమ్ జోనల్ సూపర్‌వైజర్ విశ్వేశ్వరరావు అన్నారు. జాతీయ టోల్‌ఫ్రీ ఎయిడ్స్ హెల్ప్‌లైన్ ప్రమోషన్ –1097పై గుండ్లపల్లిలోని జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలో శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్లకార్డులు ప్రదర్శిస్తూ విద్యార్థులచే సైకిల్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ గ్రామాల్లో 8 వారాల పాటు గ్రామాల్లో పర్యటించి హెచ్ఐవీ-ఎయిడ్స్‌పై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. పిడుగురాళ్ల ఐసీటీసీ కౌన్సిలర్ నాగరాజు మాట్లాడుతూ ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులపై వివక్షత, చిన్నచూపు లేకుండా కలసి జీవించే స్వేచ్ఛను కల్పించాలన్నారు. 2017 చట్టం, ఏఆర్‌టీ మందులు, 1097 టోల్‌ఫ్రీ నంబర్ గురించి అవగాహన కల్పించారు. పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం రాజమోహిని లింక్‌వర్కర్‌లు దయామణి, సాగర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఉత్తమ ఉపాధ్యాయుడికి అభినందనలు

పీసపాడు(క్రోసూరు): గ్రామంలో మండల పరిషత్ ప్రాథమిక (బీసీ) పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న దొప్పలపూడి వెంకటేశ్వర్లు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా డీఈఓ చంద్రకళ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా శనివారం క్రోసూరు మండల ఎంఈఓలు జి.కృష్ణ, గణేష్, తోటి ఉపాధ్యాయులు అవార్డు గ్రహీత ఉపాధ్యాయుడిని అభినందించారు. అవేవిధంగా మండలంలో దొప్పలపూడి వెంకటేశ్వర్లు, దూసరి ధర్మారావు, కాకర్ల గంగాధరరావులు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డు అందుకున్నారు. వీరిని మండల పలు పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాలు అభినందించారు.

లగడపాడు ఎంపీపీలో ఉపాధ్యాయ దినోత్సవం



పెదకూరపాడు: మండల పరిధిలోని లగడపాడు గ్రామంలో ఎంపీపీ స్కూల్‌లో శనివారం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సురేష్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల విద్యాధికారి ప్రసాదరావు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ గొప్పతనం వివరించారు. జాతీయ చేనేత ఐక్య వేదిక సంఘం పల్నాడు జిల్లా అధ్యక్షుడు చిల్లపల్లి సత్యం మాట్లాడుతూ ఉపాధ్యాయులు విద్యార్థులకు ప్రేరణనిచ్చి, వారిని జీవితంలో ముందుకు నడిపిస్తారన్నారు. గ్రామ పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు, ప్రసాద్ మాస్టారు మాట్లాడారు. అనంతరం పాఠశాల నుంచి బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయురాలు వరలక్ష్మిని ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామ ప్రజలు, ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు.

ముగ్గురికి సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

క్రోసూరు: అనారోగ్యంతో బాధపడుతున్న మండలంలోని పీసపాడు గ్రామానికి చెందిన ముగ్గురికి సీఎం రిలీఫ్ నిధి చెక్కులు శనివారం అందచేశారు. గ్రామానికి మక్కెన ఈశ్వరమ్మ రూ.1.20 లక్షలు, విప్పల పిచ్చిరెడ్డి రూ.60 వేలు, మూలగుండ్ల వెంకాయమ్మ రూ.40 వేల చెక్కులు అందచేశారు. గుంటూరులోని తన కార్యాలయంలో ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ చెక్కులు అందచేశారు.

పెదకూరపాడు: మండలంలోని 15 గ్రామాల్లో అనారోగ్యాలతో బాధపడుతూ చికిత్స తీసుకుంటున్న 33 మందికి రూ.24.04 లక్షల విలువైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ శనివారం పంపిణీ చేశారు.

పంటకు సరిపడా మాత్రమే కొనుగోలు చేయాలి

క్రోసూరు: రైతులు పంటకు అవసరమయ్యే యూరియా మాత్రమే కొనుగోలు చేయాలని మండల వ్యవసాయ అధికారి వేణుగోపాల్ పేర్కొన్నారు. అందుకూరు రోడ్డులో గల ప్రాథమిక వ్యవసాయ సహకార కేంద్రంలో రైతులకు అందిస్తున్న యూరియా పంపిణీని శనివారం ఆయన పరిశీలించారు.

పెదకూరపాడు: పెదకూరపాడు మండలంలో ముస్సాపురం రైతు సేవా కేంద్రానికి 19.8 టన్నులు మరియు, లగడపాడు రైతు సేవా కేంద్రానికి 19.8 టన్నులు యూరియా దిగుమతి అయి పంపిణీ కి సిద్ధంగా ఉందని వ్యవసాయ శాఖ అధికారి కృష్ణయ్య శనివారం తెలిపారు.

సత్తెనపల్లి: మండలంలోని పాకాలపాడు పీఏసీఎస్ బ్రాంచ్‌కు 19.8 మెట్రిక్ టన్నుల యూరియా (440 బస్తాలు) శనివారం సరఫరా చేసినట్లు మండల వ్యవసాయ శాఖ అధికారి బి.సుబ్బారెడ్డి తెలిపారు.

విడాకులు ఇవ్వాలని భార్య, తల్లిపై దాడి

సత్తెనపల్లి: విడాకులు ఇవ్వాలని భార్య, తల్లిపై దాడి చేసిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. వివరాలు ఇలా ఉన్నాయి... పట్టణంలోని 6వ వార్డు వడ్డెర కాలనీకి చెందిన మల్లెల పద్మ, కోటేశ్వరరావుకు 26 ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. 8 ఏళ్ల క్రితం భార్య పద్మను వదిలేసి కోటేశ్వరరావు వెళ్ళాడు. ఏడాది క్రితం మరో మహిళను వివాహం చేసుకున్నాడు. మల్లెల పద్మ తన అత్త శేషమ్మతో కలిసి జీవిస్తుంది. తనకు విడాకులు ఇవ్వాలని లేకపోతే చంపేస్తానంటూ ఈ నెల 3న కోటేశ్వరరావు తన భార్య పద్మ, తన తల్లి శేషమ్మపై దాడి చేశాడు. దీనిపై మల్లెల పద్మ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో శనివారం ఫిర్యాదు చేయగా సత్తెనపల్లి టౌన్ ఎస్‌ఐ జె.శ్రీనివాసరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భగవాన్ విశ్వకర్మ జయంతిని అధికారికంగా నిర్వహించాలి

సత్తెనపల్లి: సృష్టికర్త భగవాన్ విశ్వకర్మ జయంతిని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అధికారికంగా నిర్వహించాలని ఉత్తర్వులు జారీ చేసినందున ఈనెల 17న విశ్వకర్మ జయంతిని అధి కారికంగా నిర్వహించాలని విశ్వబ్రాహ్మణ సంఘ నియోజకవర్గఅధ్యక్షుడు చింతాడ రమేష్ కోరారు. శనివారం మున్సిపల్ కమిషనర్ ఆనంద్ కుమార్‌కు వినతి పత్రం అందించారు.

వావిలాల నగర్‌లో బోర్‌వెల్ ప్రారంభం

సత్తెనపల్లి: వియత్నం దేశ బౌద్ధ భిక్షువుల ఆర్థిక సహకారంతో సత్తెనపల్లి మండలం వావిలాల్ నగర్‌లో రెండు బోర్‌వెల్స్ వేసి ఆ ప్రాంతంలోని విద్యార్థులు, ప్రజల మంచినీటి కష్టాలను తొలగించినట్లు నిర్వాహకుడు డాక్టర్ నాగేశ్వరరావు కాసరబాద తెలిపారు. సత్తెనపల్లి మండలం వావిలాల్ నగర్ ఎంపీపీఎస్(ఆర్ఎస్) పాఠశాల ఆవరణలోని బోర్‌వెల్‌ను మండల విద్యాశాఖ అధికారి–1 అనంతవరం శ్రీనివాసరావు శనివారం ప్రారంభించి మాట్లాడారు. మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థుల నీటి కష్టాలు తొలగాయన్నారు. అలాగే వావిలాల్‌నగర్‌లోని బోర్‌వెల్‌ను మాజీ ఎంపీటీసీ పుష్పరాజు సోలంబి ప్రారంభించి తమ ప్రాంతం వారికి మంచినీటి సౌకర్యం కల్పించడంపై సంతోషం ప్రకటించారు. వియత్నం బౌద్ధ భిక్షుల సహకారంతో ఈ ప్రాంతంలో మంచినీటికి ఇబ్బంది పడుతున్న పలు ప్రాంతాల్లో ఇప్పటికీ 15 బోర్‌వెల్స్ వేసి ప్రజలకు మేలు చేయడంలో డాక్టర్ నాగేశ్వరరావు చేసిన కృషిని పలువురు అభినందించారు. ఉపాధ్యాయులు మాతంగి సాంబశివరావు, బెల్లంకొండ నాగసాయి ప్రసాద్, అరవ సుధీర్ పీతర్‌పాల్, ఆనందరావు, షేక్ జాకీర్ హుస్సేన్, రామకృష్ణ, పుష్పరాజు చంద్రన్, తదితరులు ఉన్నారు.


బోర్‌వెల్ ప్రారంభించి మాట్లాడుతున్న ఎంఈఓ-1 శ్రీనివాసరావు

ఎరువుల దుకాణంలో విజిలెన్స్ తనిఖీలు

రూ.6.90లక్షల విలువైన ఎరువులు స్వాధీనం

లంకెలకూరపాడు(ముప్పాళ్ళ): గ్రామంలోని ఎరువుల దుకాణంలో గుంటూరు రీజినల్ విజిలెన్స్ విభాగం అధికారులు శనివారం తనిఖీలు నిర్వహించి 32.8మెట్రిక్ టన్నుల ఎరువులను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు మండల వ్యవసాయాధికారి ఎస్.శ్రీధర్‌రెడ్డి తెలిపారు. గుంటూరు రీజినల్ విజిలెన్స్ విభాగం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ కె.చంద్రశేఖర్, విజిలెన్స్ వ్యవసాయ అధికారి సీహెచ్ ఆదినారాయణ, సత్తెనపల్లి ఏడీఏ బి.రవిబాబులు గ్రామంలోని శ్రీశ్రీనివాస ట్రేడర్స్ ఎరువుల దుకాణంలో తనిఖీలు నిర్వహించారు. తనిఖీలలో ఎరువుల గోడౌన్‌లోని ఎరువులు, భౌతిక నిల్వలకు, స్టాక్ రిజిస్టర్ నిల్వలకు వ్యత్యాసం ఉన్నట్లుగా గుర్తించారు. రికార్డుల నిర్వహణ కూడా సక్రమంగా లేదని పరిశీలనలో నిర్ధారించుకున్నారు. భౌతిక నిల్వలకు, స్టాక్ రిజిస్టర్ నిల్వలకు వ్యత్యాసం గమనించి రూ.6.90లక్షల విలువ ఎరువులను సీజ్ చేసి 6ఏ కేసు నమోదు చేసినట్లు తెలిపారు. దుకాణం లైసెన్స్ సస్పెండ్‌కు సిఫారసు చేసినట్లు తెలిపారు.


ఎరువుల దుకాణంలో తనిఖీలు నిర్వహిస్తున్న విజిలెన్స్ అధికారులు

అంగన్‌వాడీ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

సత్తెనపల్లి: నియోజకవర్గంలో ఖాళీగా ఉన్న ఐదు అంగన్‌వాడీ, 13 సహాయకుల పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసినట్లు ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సత్తెనపల్లి సీడీపీఓ టి.శ్రీలత శనివారం తెలిపారు. నియోజకవర్గంలోని సత్తెనపల్లి మండలం నందిగామ(ఎస్టీ) వెన్నాదేవి(ఓసీ) ముప్పాళ్ల మండలం ఇరుకుపాలెం(ఓసీ), బొల్లవరం-2(ఓసీ), నకరికల్లు మండలం పాపిశెట్టిపాలెం(బీసీ-బీ(డబ్ల్యూ)) గ్రామాల్లో అంగన్‌వాడీ కార్యకర్తల పోస్టుల భర్తీకి అర్హులైన మహిళలు దరఖాస్తు చేసుకోవాలన్నారు. నియోజకవర్గంలోని సత్తెనపల్లి మండలం లక్కరాజు గార్లపాడు-1(ఎస్సీ), ఫణిదం(బీసీ-ఏ), ధూళిపాళ్ల(ఓసీ), ముప్పాళ్ళ మండలం నార్నెపాడు-1(ఓసీ), తొండపి-3 (ఎస్సీ), లంకెలకూరపాడు-2(ఎస్సీ), రుద్రవరం-1(ఎస్సీ), రాజుపాలెం-1(ఎస్సీ), నకరికల్లు మండలం చీమలమర్రి-4 (ఎస్సీ), రూపెనగుంట్ల-4 (బీసీ-ఏ) నకరికల్లు-2 (ఎస్సీ), జిల్లాపేట(ఎస్టీ), గుండ్లపల్లి-2 (ఎస్సీ) గ్రామాల్లో అంగన్‌వాడీ సహాయకురాలు పోస్టుల భర్తీకి అర్హులైన మహిళలు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

కర్రతో దాడిపై ఫిర్యాదు

సత్తెనపల్లి: మహిళపై దాడి జరిగిన సంఘటన సత్తెనపల్లి మండలం భీమవరంలో శనివారం జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి.. భర్త చనిపోవడంతో గ్రామంలో గత ఆరు సంవత్సరాలుగా నివసిస్తున్న చల్లా కుమారికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమారుడు సామేలు కూలి పనులకు వెళ్లి నగదు ఇవ్వకపోవడంతో మందలిస్తూ దూషిస్తుండగా ఇంటి పక్కన ఉన్న ఒంటిపులి నాగమ్మ తమను ఎందుకు దూషిస్తున్నావంటూ ప్రశ్నించింది. తాను తన కుమారుని దూషిస్తున్నానని చెప్పినప్పటికీ వినిపించుకోకుండా కర్రతో నాగమ్మ దాడి చేసిందని చల్లా కుమారి సత్తెనపల్లి రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

కలలను సాకారం చేసుకోవాలి



సత్తెనపల్లి: విద్యార్థులు పట్టుదలతో చదివి తాము కన్న కలలను సాకారం చేసుకోవాలని ప్రగతి విద్యాసంస్థల వ్యవస్థాపకుడు డాక్టర్ మక్కెన అచ్చయ్య అన్నారు. పట్టణంలోని శ్రీ వైష్ణవి వారి ప్రగతి జూనియర్ కళాశాలలో ఫ్రెషర్స్ డే వేడుకలు పట్టణంలోని కాకతీయ కళ్యాణ మండపంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఏకాగ్రత, స్వయంకృషి ఉన్న ప్రతి ఒక్క విద్యార్థి విజేతగా నిలుస్తారన్నారు. కళాశాల డైరెక్టర్ దగ్గుబాటి శివ బ్రహ్మారెడ్డి తల్లి దండ్రులు కన్న కలలను నెరవేర్చే బాధ్యత తమదన్నారు. డైరెక్టర్స్ ఓ. శ్రీనివాసచారి, ఎం. సుబ్బరాజు, ఎస్ కె జానీబాషా, యు.సోమేశ్వరరావులు మాట్లాడారు. క్రీడల్లో విజేతగా నిలిచిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు.

వైభవంగా గణపతి నిమజ్జనాలు


నకరికల్లులో విఘ్నేశ్వరుని ఊరేగింపు ట్రాక్టర్‌ను నడుపుతున్న డాక్టర్ గజ్జల సుధీర్‌భార్గవ్‌రెడ్డి, భవనం రాఘవరెడ్డి


సత్తెనపల్లి వేద విద్యాసంస్థల నుంచి నిమజ్జనానికి తరలుతున్న గణనాథుడు


అచ్చంపేటలో నిమజ్జనోత్సవానికి బయలు దేరిన గణపతి

నకరికల్లు: స్థానిక కొండయ్యగుడి సెంటర్, పాతూరు, రూపెనగుంట్ల, చల్లగుండ్ల గ్రామాల్లో వినాయక నిమజ్జన వేడుకలను శుక్రవారం రాత్రి కనులపండువగా నిర్వహించారు. నకరికల్లులోని శ్రీయోగి వేమారెడ్డి భక్తసమాజం ఆధ్వర్యంలో 9 రోజుల పాటు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం నిమజ్జన వేడుకలను అంగరంగ వైభవంగా జరిపించారు. భారీఎత్తున అన్నదానం నిర్వహించారు. ముందుగా నిర్వహించిన లడ్డూ ప్రసాదాన్ని రూ లక్షకు యన్నం గోపిరెడ్డి దక్కించుకున్నారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో ఊరేగింపు నిర్వహించారు. వైఎస్సార్ సీపీ సత్తెనపల్లి సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవ్‌రెడ్డి, మండల కన్వీనర్ భవనం రాఘవరెడ్డి, పలువురు నాయకులు పాల్గొన్నారు. డాక్టర్ సుధీర్‌భార్గవ్‌రెడ్డి విఘ్నేశ్వరుని ఊరేగింపు ట్రాక్టర్‌ను నడిపారు. ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆయాగ్రామాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కోలాహలంగా నిమజ్జనోత్సవాలు..

అచ్చంపేట: గత తొమ్మిది రోజులుగా విశేష పూజలందుకున్న గణపతి విగ్రహాలను శనివారం ప్రత్యేకంగా అలంకరించిన వాహనాలపై, డప్పు వాయిద్యాలు, డాన్సులు, ఆటపాటలతో కృష్ణానదిలో నిమజ్జనం చేసేందుకు గ్రామోత్సవాలు నిర్వహించారు. అన్ని గ్రామాలనుంచి విగ్రహాలు అచ్చంపేటకు వచ్చి, అక్కడినుంచి చామర్రు, కోనూరులలోని కృష్ణానదిలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసేన క్రేన్ల ద్వారా నిమజ్జనం చేశారు. అచ్చంపేట మండలంలోని మొత్తం 84 విగ్రహాలు ఏర్పాటు చేయగా, వాటిని కొన్నింటిని మూడు, అయిదు, ఏడు రోజుల్లో నిమజ్జనం చేశారు. మిగిలిన అన్ని విగ్రహాల నిమజ్జనోత్సవాలు శనివారంతో ముగించారు. ఈ సందర్భంగా భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు.

సత్తెనపల్లి: పట్టణంలోని వేద విద్యాసంస్థలలో వినాయక నవరాత్రులలో భాగంగా నెలకొల్పిన గణనాథుడి విగ్రహానికి శనివారం విద్యార్థులు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ప్రతిమను ప్రత్యేక ట్రాక్టర్ పై ఏర్పాటు చేసి మేళ తాళాలతో ఊరేగింపు నిర్వహించి వైభవంగా నిమజ్జనం నిర్వహించారు. గుంటూరు రోడ్డులోని అమరావతి మేజర్ కాలువలో నిమజ్జనం చేశారు. ముందుగా గణపతిలడ్డూను ఎంఎల్‌టీ విద్యార్థులు రూ. 10,200 బహిరంగ వేలంలో గెలుచుకున్నారు.

మెడికల్ కళాశాలల ప్రైవేటు ఆలోచన విరమించుకోవాలి

వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పడాల సాంబశివారెడ్డి

నరసరావుపేట: పేద విద్యార్థులు మెడిసిన్ చదివే అవకాశం కల్పిస్తూ వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి తీసుకొచ్చిన మెడికల్ కళాశాలలను ప్రైవేటుపరం చేసే ఆలోచనను ముఖ్యమంత్రి చంద్రబాబు వెంటనే విరమించుకోవాలని వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి, సత్తెనపల్లి నియోజకవర్గ పరిశీలకులు పడాల సాంబశివారెడ్డి కోరారు. ఈ మేరకు శనివారం పత్రికలకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. చాలామంది తల్లిదండ్రులు తమ పిల్లలను వైద్యులుగా తీర్చిదిద్దాలని కలలు కంటారని, గతంలో రాష్ట్రంలో మెడికల్ సీట్లు లేక రష్యా, జార్జియా, ఉక్రెయిన్ వంటి దేశాలు పంపించే పరిస్థితి ఉండేదన్నారు. గత వందేళ్లలో 12 మెడికల్ కాలేజీలు ఉంటే మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి తన హయాంలో 17 మెడికల్ కాలేజీలు పర్మిషన్ తీసుకొచ్చి అందులో ఏడు కాలేజీలు పూర్తి చేసి ఇంకా పది కాలేజీలు నిర్మాణ దశలో ఉన్నాయని అన్నారు. గత 100 ఏళ్లలో ఆంధ్ర రాష్ట్రంలో 2350 మెడికల్ సీట్లు ఉంటే తన హయాంలో 2560 కొత్త మెడికల్ సీట్లు తెచ్చి అందులో పేద విద్యార్థులకు 50శాతం ఉచితంగా మిగతా 50 శాతంపై తక్కువ ఫీజులో పేద విద్యార్థులకు మెడిసిన్ చదివే అవకాశం కల్పించారన్నారు. విలేజ్ హెల్త్ క్లినిక్స్, మెడికల్ కాలేజీలు పెట్టి ప్రతి పేదవాడి దగ్గరకే వైద్యం అందే ఆలోచన చేశారన్నారు. చంద్రబాబు నాయుడు మూడుసార్లు ముఖ్యమంత్రిగా పనిచేసినా ఒక మెడికల్ కాలేజీ కట్టకపోగా జగన్‌మోహనరెడ్డి కట్టిన మెడికల్ కాలేజీలో ప్రైవేటీకరణ చేస్తారని ప్రకటించటం దారుణమన్నారు. ఈ ఆలోచన విరమించుకోకపోతే ప్రజల ఆగ్రహానికి గురికావాల్సి వస్తుందని హెచ్చరించారు.

విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ

అచ్చంపేట: మండలంలోని చెరుకుంపాలెంలో స్నేహహస్తాలు ఫౌండేషన్ సౌజన్యంతో 14 మంది హైస్కూలు విద్యార్థులకు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ చేతులమీదుగా సైకిళ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ నిర్వాహకులు కూరపాటి శివరాం మాట్లాడుతూ జడపల్లి, కంచుబోతుండాలకు చెందిన ఆరుగురు బాలికలు 4.5 కిలోమీటర్ల దూరంలో ఉన్న మాదిపాడులోని హైస్కూలో చదివేందుకు రోజు నడిచి రావడం చూసి వారి విద్యాభివృద్ధికి ఆటంకం కలగకూడదన్న ఉద్దేశ్యంతో ఒక్కొక్కటి రూ.5వేలు విలువచేసే సైకిళ్లను ఇచ్చామన్నారు. అదే విధంగా చిగురుపాడు నుంచి రెండు కిలో మీటర్ల దూరంలో అచ్చంపేట హైస్కూలులో చదివే ఇరువురికి, 88తాళ్లూరులో జడ్పీ హైస్కూలో చదివే మరో ఆరుగురికి సైకిళ్లు పంపిణి చేసినట్లు చెప్పారు. జడ్పీ హైస్కూలు, మాదిపాడులో విద్యార్థులు మధ్యాహ్న భోజనం చేసేందుకు షెడ్ నిర్మాణానికి రూ.3 లక్షల చెక్కును పాఠశాల హెచ్‌ఎంకు అందచేశారు. కొత్తపల్లికి చెందిన నిరుపేద విద్యార్థి డిగ్రీ పూర్తి చేసేందుకు కావలసిన రూ.15వేల చెక్కు అందచేశారు. ఈ విద్యార్థికి మొదటి సంవత్సరం రూ.25వేలు, రెండవ సంవత్సరం రూ.15వేలు, ప్రస్తుత సంవత్సరం రూ.15తో మొత్తం కలిపి ఇప్పటి వరకు రూ.55లు ఇచ్చినట్లు చెప్పారు. ఉసిరికాయల నిహారిక అనే విద్యార్థికి బీటెక్ చదివేందుకు ఫీజు నిమిత్తం రూ.20వేలు అందచేశారు. ఫౌండేషన్ సభ్యులు మన్నెం భద్రయ్య, కో ఆర్డినేటర్ తాయి కరిముల్లాబాబు, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.


విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ప్రవీణ్

ద్విచక్ర వాహనం చోరీపై ఫిర్యాదు

నరసరావుపేట టౌన్: ద్విచక్ర వాహనం అపహరణపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ సీఐ ఎం.వి. చరణ్ శనివారం తెలిపారు. ఇస్లాంపేటకు చెందిన పఠాన్ హుస్సేన్ షరీఫ్ తన ద్విచక్ర వాహనాన్ని శుక్రవారం ఆర్టీసీ బస్టాండ్ వెనుక సతీష్ రోడ్డులోని ఓ ఫాస్ట్ ఫుడ్ సెంటర్ ఎదుట ద్విచక్ర వాహనాన్ని నిలిపాడు. కొద్దిసేపటి తర్వాత వాహనం కనిపించ లేదు. చుట్టుపక్కల వెతికినా ప్రయోజనం దక్కలేదు. ఈ మేరకు బాధితుడు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

సచివాలయ ఉద్యోగుల నిరసన



నాదెండ్ల: వలంటీర్ల పనులను సచివాలయ సిబ్బందితో బలవంతంగా చేయిస్తూ ఆత్మగౌరవానికి భంగం కలిగిస్తున్న ప్రభుత్వ తీరును నిరసిస్తూ ఏపీ గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల జేఏసీ సభ్యులు శనివారం డిప్యూటీ ఎంపీడీవో తోకల వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ సమస్యలు తీసుకెళ్లినా ప్రయోజనం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నెల 5వ తేదీన అధికారికంగా సామాజిక మాధ్యమాల ద్వారా ప్రభుత్వానికి సమస్యలు విన్నవించామన్నారు. రాష్ట్ర పరిపాలనలో ప్రాణవాయువు లాంటి సచివాలయ ఉద్యోగుల శక్తిని నిర్వీర్యం చేసేలా ప్రభుత్వం వ్యవహరిస్తున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో వలంటీర్లు ఒక క్లస్టర్‌కు పరిమితమై నిర్వహించిన విధులను సచివాలయ ఉద్యోగులకు ఒకటి కంటే ఎక్కువ క్లస్టర్లు కేటాయించి అధిక పనిభారం మోపుతున్నారని వాపోయారు. ప్రభుత్వ తీరును నిరసిస్తూ నల్ల బ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు.

గుజరాత్ రోడ్డు ప్రమాదంలో మాదల విద్యార్థి మృతి


కొడవటి నరేష్ (ఫైల్)

మాదల(ముప్పాళ్ళ): పల్నాడు జిల్లా మాదల గ్రామానికి చెందిన జాతీయ కబడ్డీ జట్టు ప్లేయర్, ఇంజినీరింగ్ విద్యార్థి కొడవటి నరేష్(19) గుజరాత్ రాష్ట్రం రాజ్‌కోట్ జిల్లా జంగ్వాడ్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృత్యువాత పడ్డాడు. కుటుంబసభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామంలోని ఎస్సీ కాలనీకి చెందిన కొడవటి నరేష్ గుజరాత్‌లోని ఆర్‌కే యూనివర్సిటీలో ఇంజినీరింగ్ చదువుకునేందుకు వెళ్లాడు. వినాయకచవితి సెలవులు కావటంతో సీనియర్‌లతో కలిసి కారులో ద్వారకా వెళుతుండగా మార్గమధ్యలోని జంగ్వాడ్ వద్ద శనివారం తెల్లవారుజామున జరిగిన ప్రమాదంలో మృత్యువాత పడ్డాడు. నరేష్ మృతితో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. మృతదేహానికి పోస్టుమార్టం పూర్తయిందని, ఇంటికి తీసుకొస్తున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. బాల్యం నుంచి క్రీడల్లో ఆసక్తి చూపే నరేష్ కబడ్డీ, ఫుట్‌బాల్‌లలో అంచెలంచలుగా ప్రతిభ చూపుతూ జాతీయ కబడ్డీ జట్టుకు సైతం ఎంపికైరాణించాడు. నరేష్ మృతితో మాదలలో విషాదఛాయలు అలుముకున్నాయి.